క్లుప్తంగా

శుద్ధి నీటి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



ప్లాంట్ ఏర్పాటుపై మేయర్‌తో చర్చిస్తున్న లోకేష్ రెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలో మూడు చోట్ల శుద్ధి నీటి ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి స్థలాలను మేయర్ అముద పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్ రెడ్డి వీటిని సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నారు. ఆయన గురువారం మేయర్ అముదతో కలిసి నగరంలోని 1, 39, 50వ డివిజన్లో శుద్ధినీటి ప్లాంటు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. వీలైనంత త్వరలోనే వీటిని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉచితంగా శుద్ధి నీటిని అందిస్తునట్లు లోకేష్ రెడ్డి తెలిపారు.

కొత్తపల్లెలో కంటి వెలుగు



కొత్తపల్లెలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాదమరి : మండలంలోని కొత్తపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహించిన అవ్వతాతల కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో పలువురి వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో కొందరిని కళ్ల అద్దాలు, మరి కొందరిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వైద్యులు ఎంఎల్‌హెచ్ విష్ణుప్రియా, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి




మాట్లాడుతున్న హరిప్రసాద్‌రెడ్డి

బంగారుపాళెం: సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో గురువారం గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమ పథకాలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమం(1902) ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇఫ్టా ఆవిర్భావ వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: ఇఫ్టా (ఐరిష్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ అకాడమీ) 80వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం చిత్తూరులో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలను చైతన్య పరచడానికి కళాకారులు ఎంతో కృషి చేస్తున్నారని నాయకులు కొనియాడారు. ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో అనేక మంది రచయితలు, కవులు, సినీ రంగాల్లో పేరు పొందిన నటులను ఇఫ్టా తయారు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుర్రప్ప, సుబ్రహ్మణ్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శునకానికి అంత్యక్రియలు



చిత్తూరు రూరల్: నగరంలోని రాములుగుడి వీధికి చెందిన మల్లి పెంచుకుంటున్న శునకం (యూకీ) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ శునకానికి అంత్యక్రియలు నిర్వహించి ప్రేమను చాటుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పలమనేరు: మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద రంగారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు చందూల్ రెడ్డి రసాయన రహిత, గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై పలువురు రైతులకు తన అనుభవాలను వివరించారు. ప్రకృతి సేద్యంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించుకుని అధిక ఆదాయం ఎలా పొందవచ్చో తెలియజేశారు. రోహిణి కార్తె నుంచి ఆరుద్ర దాకా ఈ ప్రాంతంలో ఎలాంటి దేశవాళీ వరి వంగడాలను సాగచేయాలో తెలియజేశారు.

నేడు ఆయుర్వేద శిబిరం

పలమనేరు: పట్టణ సమీపంలోని కిండర్ కేర్ స్పెషల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం పదేళ్లలోపు బుద్ధిమాంద్యం చిన్నారులు, అంగవైకల్యం పిల్లలకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక సెంటర్‌లో ఆమె మాట్లాడుతూ, కేరళకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని, అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ తీరు మారాల్సిందే!

- లేకుంటే చర్యలు తప్పవు
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు





యాదమరిలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, అరగొండ సచివాలయంలో సేవా వజ్ర పురస్కారం అందుకుంటున్న హసీఫా

యాదమరి: రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాల్సిందే.. లేకుంటే చర్యలు తప్పవని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హెచ్చరించారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తహసీల్దార్ చిట్టిబాబు మాట్లాడుతుండగా ఎమ్మెల్యే కలగజేసుకొని మండల పరిధిలో 184 గొల్లపల్లెలో జగనన్న కాలనీకి సంబంధించిన స్థలంపై స్థానికులు కోర్టుకు వెళ్లారని దీనిపై ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. వెంటనే వారితో మాట్లాడి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చూడాలని ఆదేశించారు. ప్రజలు, రైతులు రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇచ్చినా పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని చెప్పారు. దీనిపై సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు నెలలకోసారి నిర్వహించే ఈ మండల సర్వసభ్య సమావేశంలో ఆయా పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి, పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తున్నామని, ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ శివరాజ్, అధికారులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

ప్రతి రైతుకు వేరుశనగ విత్తనాలు అందిస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. వ్యవసాయశాఖ ఏఓ చరిత పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

కష్టపడేవారందరినీ ప్రభుత్వం గుర్తించి సన్మానిస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కుక్కలపల్లె సచివాలయంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

తవణంపల్లె: వలంటీర్లు సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. గురువారం మండలంలోని అరగొండ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్ర పురస్కారాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి సీఎంగా చేయడానికి వలంటీర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగాలన్నా, ప్రజలకు వివిధ రకాల పథకాలు అందాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరుతేవాలన్నారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు మరింత కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు కిషోర్ రెడ్డి, పార్థసారథిరెడ్డి, సందీప్ రెడ్డి, ప్రశాంతకుమార్, విక్రమ్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పూతలపట్టు మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇలానే ఉంటే సస్పెండ్ చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో ఇలా నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని అర్బన్ ఈఈ కార్యాలయంలో గురువారం విద్యుత్ శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షి దినపత్రికలో ‘మృత్యు నీడలో విద్యుత్ సిబ్బంది’ అనే శీర్షికన కథనం గురువారం ప్రచురితమైంది. దీనిపై ఆయన స్పందించి అధికారులను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో జేఎల్‌ఎంలతో ఎందుకు నేరుగా పనిచేయిస్తున్నారని ప్రశ్నించారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఏఈలు ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. యాదమరి ఏఈ తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామన్నారు. మరికొన్ని సెక్షన్ల ఏఈలకు అదే హెచ్చరికలు జారీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటే ఎందుకు సకాలంలో మార్చడం లేదన్నారు. విద్యుత్ సేవలకు డబ్బులు అడిగితే చర్యలు తప్పవని చెప్పారు. క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లు పనిచేయకుండా నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయలోపం లేకుండా పనిచేయాలని చెప్పారు. ఏఈలు పద్ధతి మార్చుకోకపోతే బదిలీ చేస్తామని అందులో ఎటువంటి సందేహం లేదని వివరించారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

బంగారుపాళెం: మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర ఎక్కువైంది. ఉన్న ఫలంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు చిరుజల్లులతో మొదలై భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో మురుగునీటి కాలువలు పొంగి జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంలో జలమయమైంది. వాహనదారులు రాకపోకలతో ఇబ్బందులు పడ్డారు. మొగిలి వెంకటగిరి వద్ద నూర్పిడిచేసి ఎండబెట్టిన వరి వర్షపునీటిలో కొట్టుకుపోయిందని బందార్లపల్లెకు చెందిన రైతు వెంకటాద్రి వాపోయాడు. వర్షానికి తోడు గాలులు వీచడంతో మామిడి తోటల్లో కాయలు నేలరాలిపోయాయని రైతులు అంటున్నారు. ఉక్కపోతతో అల్లాడిన జనానికి భారీ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది.

నగరంలో వలంటీర్లకు సన్మానం





చిత్తూరులో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గుడిపాల మండలంలో కుంభాభిషేక మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: ప్రతి గడప వలంటీర్ల చేతిలోనే ఉందని, ప్రభుత్వం అందించే సేవలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింతగా ఇంటింటికీ తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలోని 17,18,19 డివిజన్లలో వలంటీర్లను గురువారం ఆయన సన్మానించి మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు దక్కేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ కుట్టి రాయల్, కో ఆప్షన్ మెంబర్ చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

గుడిపాల: మండలంలోని మందిక్రిష్ణాపురంలో కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వీరాంజనేస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మంగళహారతి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కోదండరామస్వామి కుంభాభిషేకం నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం పాటు సాయంత్రం కోదండరామస్వామి ఉత్సవం నిర్వహించారు. ఈ కుంభాభిషేకంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సత్యమూర్తి సేవలు మరువలేనివి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించిన నాయకుడు సత్యమూర్తి మరణం పార్టీకి తీరని లోటని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యమూర్తి మృతి చెందగా గురువారం ఆయనకు ఉత్తరక్రియలు నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సత్యమూర్తి దూరం కావడం చాలా బాధాకరమన్నారు. ఆయన సేవలు మరువలేనివని చెప్పారు.

గడప గడపకూ సంక్షేమం అమలు



కమ్మగుట్టపల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలులోకి వచ్చినప్పటి నుంచి అర్హులైన ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు అన్నారు. మండలంలోని కమ్మగుట్టపల్లి సచివాలయ పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, వారు పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించారు. రేషన్‌కార్డు, ఇళ్ల పట్టాలు, కాలువలు, రోడ్ల తదితర సమస్యలు ఆయన దృష్టికి రావడంతో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ సంక్షేమం అభివృద్ధి ఆగకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధితోపాటు ప్రతి గడపలోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లిబాబు రెడ్డి, రాజారత్నంరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, త్యాగరాజు, ఎంపీడీఓ గౌరి, ఎస్‌ఐ హరిప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, సర్పంచులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

పూతలపట్టు: మండలంలోని బైటపల్లి -ఎర్రేపల్లి రోడ్డును గురువారం ఎమ్మెల్యే ఎం.ఎస్‌బాబు పరిశీలించారు. ఇటీవల పీఎంపీఎస్‌వై నుంచి రూ.2 కోట్లతో ఈరోడ్డుకు తారు వేసేందుకు అనుమతులు వచ్చాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే రోడ్డును పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజరత్నంరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, దొరస్వామి రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పవన్

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వస్తున్నట్లు 104 వైద్యాధికారి పవన్ అన్నారు. కొత్తకోట గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచాన పడ్డ రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుమతి, హైమావతి, భాస్కర్, గీత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి సేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగన్ కృషి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పెనుమూరు మండల జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుంటిపల్లె రైతు భరోసా కేంద్రంలో జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, పెనుమూరు మార్కెట్ యార్డు నందు కమలాకర్ రెడ్డి రైతులకు వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు ఎల్లప్పుడు ప్రభుత్వం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. ముందస్తుగానే పెట్టుబడి నిధిని అందించి పంటల సాగుకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, సాతంబాకం ఎంపీటీసీ యశోదారెడ్డి, నాయకులు యం.సురేష్‌రెడ్డి, దూది మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’పై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘జగనన్నకు చెబుదాం (1902)’ కార్యక్రమంపై విస్తత ప్రచారం చేయాలని నగర కమిషనర్ అరుణ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంపై గురువారం నగర పాలక కార్యాలయంలో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వలంటీర్లు గృహాల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. 1902కు ఎలా కాల్ చేయాలి? సమస్యను ఎలా తెలియజెప్పాలి అనే అంశాలపై ముందుగా వలంటీర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆ తరువాత రెండు రోజులపాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. వార్డు కార్యదర్శులు సమన్వయం చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణం





వసంతాపురంలో ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణ మహోత్సవంలో ఉత్సవమూర్తులు, తిలకిస్తున్న మహిళలు

గుడిపాల: ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణ మహోత్సవం గురువారం కనులపండువగా సాగింది. మండలంలోని వసంతాపురంలో 18 రోజుల పాటు నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం ద్రౌపదీ కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. ద్రౌపదీ ధర్మరాజుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా సుబ్రమణ్యం, లలిత దంపతులు వ్యవహరించారు. సంప్రదాయబద్ధంగా పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భాగవతారిణి నాగరత్న అమ్మవారి కల్యాణోత్సవానికి సంబంధించిన హరికథను భక్తులకు వినిపించింది. ఈ కల్యాణోత్సవానికి హాజరైన మహిళలకు పసుపు కుంకుమతోపాటు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు వచ్చిన వారందరికీ అన్నదానం చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

బంగారుపాళెం: స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం వరదరాజన్ అన్నారు. మండలంలోని బొమ్మాయిపల్లెలో గురువారం సాయంత్రం బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ రుణాలపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు, రైతులకు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎం వాణికిషోర్‌కుమార్‌రెడ్డి, బంగారుపాళెం స్టేట్‌బ్యాంక్ మేనేజర్ రామారావు మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న రుణాలను వివరించారు. స్థానిక సర్పంచ్ గౌరమ్మ, అగ్రి బిజినెస్ యూనిట్ డీజీఎం హేమ, ఇన్‌చార్జి ఎంపిడిఓ హరాప్రసాద్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.